WWW.TELUGUJYOTHIDAILY.IN
www.epaperteluguj yothidaily.in
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 02 | సంచిక: 120 | ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ | గురువారం 10 సెప్టెంబర్ 2026 | పేజీలు : 6 | వెల : 4-00

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA,SRIKAKULAM

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ..
అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న
తెలుగు జ్యోతి న్యూస్ తెలుగు
నపత్రికలో పనిచేయుటకు అనుభవం,
ఆసక్తి గల వారికి అవకాశం కలదు.
కలిగినవారు సంప్రంచగలరు

సెల్ : 97009 59506



## భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు



## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన

# ఆ రెండూ కుట్రలే!

- స్పీకర్‌ను, శుద్ధి పేరుతో దళితులను అవమానించటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది
- వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై కేసులు పెడతాం: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తాం
- విచారణాధికారిగా హైదరాబాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్
- ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే కుట్రలు
- ఫామ్‌హౌస్ భేటీలోనే వ్యూహరచన.. కేసీఆర్ అనుచరులను ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారు
- దళితులను అవమానించిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలన్న సీఎం
- వారిలోని అహంకార, అంటరానితన భావాన్ని యాసిడ్‌తో శుద్ధి చేయాలా? అంటూ ప్రశ్న
- ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టీకరణ



హైదరాబాద్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన మాతృమూర్తిని కించపరిచి అవమానించటం, అనంతరం ఆయనకు మద్దతుగా నిరసన తెలిపిన దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలను కుట్రలుగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఇందుకు వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై ఆయా సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తామని అన్నారు. ముంబయిపై దాడి చేసిన కసబ్ లాంటి ఉగ్రవాదులకు కొన్ని అంశాలను నూరిపోసి ఉన్మాదులుగా మార్చి మన దేశంపైకి పంపిన తరహాలోనే, కేసీఆర్ కూడా తన అనుచరులకు ఇలాగే నూరిపోసి ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారని ఆరోపించారు. దాంతో పేట్రేగిన నేతలు ఆ రోజు దళిత స్పీకర్‌ను కించపరచటమే లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి ముందురోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీలో చేసిన కుట్ర మొదలు ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న ఘటనలపై సంపూర్ణ విచారణ చేపడతామన్నారు. హైదరా బాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను - మిగతా 7లో



## కోహెడకు రూ.637.70 కోట్లు

- ప్రపంచస్థాయి పండ్ల మార్కెట్ తొలి దశ పనులకు అనుమతి
- 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు
- మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు.

హైదరాబాద్

రాష్ట్ర రాజధానికి సమీపంలో కోహెడలో నిర్మించనున్న ప్రపంచస్థాయి సమగ్ర పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడటమే లక్ష్యంగా దీన్ని నిర్మిస్తోంది. మార్కెట్ తొలి దశ పనులకు రూ.637.70 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా - మిగతా 7లో

## ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు



# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్




- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్
- సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- దీంతో సస్పన్షన్ వేటు వేస్తూ ప్రకటించిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- బీఆర్ఎస్ సభ్యులను సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన స్పీకర్

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, - మిగతా 7లో








# బొల్లారం వార్డులో అధికారుల విస్తృత పర్యటన

**ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : కమిషనర్ జి. సృజన**

తెలుగుజ్యోతి । శేరిలింగంపల్లి






ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన "ప్రతిరోజు ఒక వార్డు" కార్యక్రమంలో భాగంగా బుధవారం బొల్లారం వార్డులో మున్సిపల్ అధికారులు విస్తృతంగా పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఐఏఎస్, శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ వార్డులో పర్యటించి మౌలిక వసతులు, పౌర సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు, నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో అధికారులు సమావేశమయ్యారు. రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మురుగునీటి కాలువలు తదితర సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ సమీక్షించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన, మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో ఇంజినీరింగ్, పారిశుధ్య, విపత్తు నిర్వహణ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్-లెట్ డబుల్ ధమాకా ఎగ్జిబిషన్ కూకట్‌పల్లి మరియు కుషాయిగూడలలో మెగా సేల్స్

తెలుగు జ్యోతి సెప్టెంబర్ 9 హైదరాబాద్

నిజాంపేట్ మరియు అమీర్‌పేట్ లలో తమ ఫ్యాక్టరీ అవుట్-లెట్ మెగా సేల్స్ ఎగ్జిబిషన్ సాధించిన అద్భుత విజయాన్ని పురస్కరించుకుని, ఆ చరిత్రను పునరావృతం చేసే దిశగా కూకట్‌పల్లి మరియు కుషాయిగూడ (ఈసిఐఎల్ 'ఆ' రోడ్స్) లలో కూడా అదే తరహా ఫ్యాక్టరీ అవుట్-లెట్ డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్లకు ఆర్.ఎస్.బి వారు సెప్టెంబరు 9వ తేదీ నాడు శ్రీకారం చుట్టారు. కూకట్‌పల్లి మరియు కుషాయిగూడ పరిసర ప్రాంతాల షాపింగ్‌ప్రియులకు ఈ ఫ్యాక్టరీ అవుట్-లెట్, డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్ల ఎంతో ప్రయోజనకరంగా ఉండగలవని నిర్వాహకులు పత్రికా ముఖంగా తెలియజేశారు. ప్రముఖ టీవీ వ్యాఖ్యాత రష్మి గౌతమ్ ఈ మెగా సేల్స్ ఎగ్జిబిషన్లను ఘనంగా ప్రారంభించారు. రాబోవు పండుగలు, పర్వదినాలను పురస్కరించుకుని కుటుంబంలోని అన్నితరాల వారి అభిరుచులను ప్రతిబింబిస్తూ, సంప్రదాయ శైలి మొదలుకుని, అధునాతన శైలి ఉట్టిపడే వైవిధ్యభరితమైన ఉత్పత్తులు ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్-లెట్, డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్లలో అందుబాటులో ఉన్నాయి. అటు నాణ్యత, ఇటు పొదుపు రెండూ మేళవించిన ఈ ఎగ్జిబిషన్ల ఆర్.ఎస్.బి. ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి చేర్చగలదని సందర్శకులు, షాపింగ్ ప్రియులు భావిస్తున్నారు. ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్-లెట్ ఎగ్జిబిషన్ - కూకట్‌పల్లి సమయం: సెప్టెంబర్ 9, ఉదయం 10:00 గంటలకు తేదీ: సెప్టెంబరు 9 నుంచి 17, 2026 వరకు వేదిక: శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మండపం, కూకట్‌పల్లి, హైదరాబాద్





**ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్-లెట్ ఎగ్జిబిషన్ కుషాయిగూడ**

సమయం: సెప్టెంబర్ 9, ఉదయం 11:30 గంటలకు తేదీ: సెప్టెంబరు 9 నుంచి 16, 2026 వరకు వేదిక: శ్రీలక్ష్మి కన్వెన్షన్, ఈసిఐఎల్ దగ్గర, కుషాయిగూడ

**ఇక్కడి ఉత్పత్తుల వైవిధ్యాన్ని గమనించండి**

లేడీస్ వేర్: విస్తృత శ్రేణికి చెందిన సంప్రదాయ పట్టుచీరెలు, ఎత్నిక్ డ్రెస్ మెటీరియల్స్, ట్రెండీ డైలీ అవుట్-ఫిట్స్, పార్టీ వేర్, డైలీవేర్ అవుట్-ఫిట్స్

మెన్స్ వేర్: ఉన్నత నాణ్యతకు చెందిన ఫార్మల్ వేర్, క్యాజువల్ షర్ట్స్, మన్నిక కలిగిన ట్రౌజర్స్, విలాసవంతమైన ట్రెడిషనల్ ఎత్నిక్ కలెక్షన్స్, అన్ని సందర్భాలకూ సరిపోయే వైవిధ్యభరితమైన అవుట్-ఫిట్స్ కిడ్స్ వేర్: అబ్బాయిలకు, అమ్మాయిలకు క్యూట్‌గా ఉండే కలర్స్‌తో, మన్నిక కలిగి... అన్ని రకాల వయసుల వారికీ అచ్చంగా సరిపోయే దుస్తులు హోమ్ ఫర్నిషింగ్స్: ప్రీమియం బెడ్-షీట్స్, హుందాతో కూడిన విండో కర్టెన్స్, మృదువైన బాత్ టవల్స్, లివింగ్ ప్లేస్‌కి అందాన్ని చేకూర్చే అనేక ఉత్పత్తులు ఆర్.ఎస్.బి యాజమాన్యం ఈ సందర్భంగా కూకట్‌పల్లి మరియు కుషాయిగూడ పరిసర ప్రాంతాలలోని వస్త్ర ప్రియులు ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్-లెట్ డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్ల కు విచ్చేసి, హోల్‌సేల్ ధరలకు నేరుగా ఫ్యాక్టరీ ఉత్పత్తులను ఎంపిక చేసుకోవలసిందిగా, ఆర్థికపరమైన లబ్ధిని పొందాల్సిందిగా ఈ పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేస్తోంది.

# కూకట్‌పల్లిలో శ్రీ గురు రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటల్ ఘనంగా ప్రారంభం

తెలుగు జ్యోతి సెప్టెంబర్ 9 కూకట్‌పల్లి:

నగరంలోని కూకట్‌పల్లి వివేకానంద నగర్ డివిజన్‌లో, పిల్లర్ నంబర్ 785 సమీపంలో శ్రీ గురు రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటల్ ఘనంగా ప్రారంభమైంది. హోటల్ యజమానులు వీరేశప్ప, కుమార్ గారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గ్రాండ్‌గా ప్రారంభించారు.

ప్రస్తుత కాలంలో ప్రజలు ఆహారం విషయంలో రుచి మాత్రమే కాకుండా పరిశుభ్రత, నాణ్యత, హైజీన్, మంచి సర్వీసింగ్‌కు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని శ్రీ గురు రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**హైజీన్‌కు అధిక ప్రాధాన్యత**

హోటల్‌లో ఆహార పదార్థాల తయారీ నుంచి వినియోగదారులకు వడ్డించే వరకు పరిశుభ్రత పాటించడమే తమ ప్రధాన లక్ష్యమని యజమానులు వీరేశప్ప, కుమార్ గారు తెలిపారు. నాణ్యమైన పదార్థాలను ఉపయోగిస్తూ, శుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి వినియోగదారులకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఉడిపి సంప్రదాయానికి అనుగుణంగా రుచికరమైన శాకాహార వంటకాలను అందించడంతో పాటు, కుటుంబ సభ్యులతో కలిసి సౌకర్యవంతంగా భోజనం చేసే విధంగా హోటల్ వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**స్థానిక ప్రజలకు అందుబాటులో మంచి వెజ్ ఫుడ్**

వివేకానంద నగర్, కూకట్‌పల్లి మరియు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో హోటల్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు నాణ్యమైన శాకాహార ఆహారం అందుబాటులోకి వచ్చినట్లయింది. ఉదయం అల్పాహారం నుంచి భోజనం వరకు వివిధ రకాల వెజిటేరియన్ వంటకాలను అందించేందుకు హోటల్ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.





రుచికరమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, మంచి సర్వీసింగ్‌తో వినియోగదారుల మనసు గెలుచుకోవడమే తమ లక్ష్యమని యజమానులు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ హోటల్‌ను ఆదరించి, తమ సేవలను ఉపయోగించుకోవాలని వారు కోరారు.

**వినియోగదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం**

ఆహార రంగంలో వినియోగదారుల నమ్మకం ఎంతో ముఖ్యమని నిర్వాహకులు తెలిపారు. ఒక్కసారి వచ్చే కస్టమర్‌ను తిరిగి వచ్చేలా చేసే విధంగా రుచి, నాణ్యత, పరిశుభ్రతతో సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి వినియోగదారుడికి మంచి అనుభూతి కలిగేలా సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ఇప్పటికే అనేక హోటళ్లు ఉన్నప్పటికీ, పరిశుభ్రమైన ఆహారం, నాణ్యత, రుచి, మంచి సేవలను కలిపి అందించాలనే ఉద్దేశంతో శ్రీ గురు రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటల్‌ను ప్రారంభించడం విశేషమని స్థానికులు అభిప్రాయపడ్డారు. హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రముఖులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని యజమానులు వీరేశప్ప, కుమార్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. హోటల్ మరింత అభివృద్ధి చెందాలని, కూకట్‌పల్లి ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

## పటాన్‌చెరులో గంజాయి విక్రయంపై పోలీసుల ఉక్కుపాదం



**1.76 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్**

పటాన్‌చెరు: సెప్టెంబర్ 9 తెలుగు జ్యోతి రిపోర్టర్ మన్నె ప్రసాద్

అక్రమ గంజాయి విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిపై పటాన్‌చెరు పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. అమీర్‌పూర్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 1.76 కిలోల ఎండు గంజాయితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డిపిఇఒ, షేర్ లింగంపల్లి ఆదేశాల మేరకు, ఎఇఎస్, షేర్ లింగంపల్లి పర్యవేక్షణలో ఎస్‌హెచ్‌ఓ పటాన్‌చెరు బృందం ఈ దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా అక్రమంగా గంజాయిని కలిగి ఉండటంతో పాటు రవాణా, విక్రయానికి సంబంధించిన వ్యవహారాన్ని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని తెలుగు రాజేష్ (26), తండ్రి కృష్ణ, వృత్తి డ్రైవర్, స్వస్థలం కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్గా పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి 1.76 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



**మండప నిర్వాహకులకు పోలీసుల అవగాహన సదస్సు**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి) :

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి సీఐ డి. స్వామి గౌడ్ సూచించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యుల కోసం ఎన్ఆర్‌సీ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి సీఐ డి. స్వామి గౌడ్, ఎస్సైలు చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి, తుకారం తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, కమిటీ సభ్యులకు ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు పాటిస్తూ పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా పోలీసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు అధికారులు ఇచ్చిన సూచనలను పూర్తిగా పాటిస్తామని తెలిపారు. వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, డీజేలకు దూరంగా ఉంటూ మైకులు, రంగురంగుల విద్యుత్ దీపాలు, బ్యాండ్ మేళాలతో శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించి వినాయకుడిని నిమజ్జనం చేస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తి, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరిస్తామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో యువజన కమిటీ సభ్యులు నందు, రోహిత్, రిత్విక్, నాని, జశ్వంత్, అఖిల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలి

**సనత్ నగర్ సిఐ కి ఫిర్యాదును అందజేసిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

బాలానగర్, సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి) :




తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫతేనగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు కంచి బిక్షపతితో కలిసి సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన పండాల సతీష్ గౌడ్, పోలీస్ స్టేషన్ సీఐ అశోక్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. కేసీఆర్‌పై ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిపై చట్ట పరంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. భారతీయ న్యాయ సంహిత 2023లోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖ నాయకుడిపై బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజల్లో ఆందోళన, ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఈ అంశాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించి, వ్యాఖ్యలకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పండాల సతీష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో భాగయ్య, సురేంద్ర నాయుడు, కుమారి జ్యోతి, ప్రియా, సునీత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్'బాకీ కార్డు'ల డ్రామాపై కాంగ్రెస్ విరుచుకుపాటు

**తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డ తర్వాత తొలి ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానని చెప్పి మాట తప్పింది మీరు కాదా?**
**ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల పొలం ఇస్తానన్నారు ఇచ్చారా? అప్పుడు గుర్తుకు రాలేదా బాకీ కార్డులు**
**పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలేవని నిలదీసిన పులి శివకుమార్**

బాలానగర్, సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి) :

శాసనసభ వేదికగా ప్రజల సమస్యలు చర్చించకుండా నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, అసూయ, ద్వేషం గుప్పించడమే పనిగా పెట్టుకున్న బిఆర్ఎస్ నాయకుల వైఖరిపై బాలానగర్ కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులకు కనీస సహనం, ఓపిక లేకపోవడం శోచనీయమని పులి శివకుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బిఆర్ఎస్ నేతలు "బాకీ కార్డులు" పంచుతూ తిరగడంపై ఘాటుగా స్పందించారు. పదేళ్ల తమ హయాంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ బిఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు.

**హామీల అమలుపై నిలదీత:**
దళిత ముఖ్యమంత్రి ఏరి: దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి ఎన్నికల తర్వాత కెసిఆర్ పీఠమెక్కారని, అప్పుడు ఈ బాకీ కార్డు ఏమైందని నిలదీశారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మూడు ఎకరాల భూమి ఏది : ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోనప్పుడు బిఆర్ఎస్ నాయకుల బాకీ కార్డు ఎందుకు బయటకు రాలేదని ఎండగట్టారు. పదేళ్ల సుదీర్ఘ పాలనలో ఒక్క కొత్త తెల్ల రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అప్పుడు ప్రజలకు బిఆర్ఎస్ బాకీ పడలేదా అని మండిపడ్డారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించక పేదలు ఆస్పత్రుల్లో అల్లాడిపోయినప్పుడు బిఆర్ఎస్ బాకీ కార్డు ఏమైందని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా విమర్శలు పక్కన పెట్టి, పదేళ్ల తమ అధికారంలో ఎన్ని హామీలు పూర్తయ్యాయో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషాన్ని చిమ్మడం మాని, తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వానికి సహకరించాలని



బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ కోరారు.

# మేడిపల్లి (చెంగిచెర్ల )లో తొలిసారిగా తెలంగాణ ఉత్సవ మేళా

**దుబాయివాటర్ ఫాల్స్ ప్రత్యేక ఆకర్షణ**

తెలుగు జ్యోతి సెప్టెంబర్ 9 హైదరాబాద్ :

మేడిపల్లి ప్రాంతంలో తొలిసారిగా "తెలంగాణ ఉత్సవ మేళా" నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి చాంగిచర్ల ఎక్స్ రోడ్స్ (పి.నెం.119), మెదిపల్లిలో మేళా ప్రారంభం కానుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కుటుంబ సమేతంగా ఆనందించే విధంగా ఈ ఉత్సవ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మేళాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న దుబాయ్ వాటర్ ఫాల్స్, అతి పెద్ద జెయింట్ వీల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. అదేవిధంగా చిన్నారుల కోసం వివిధ రకాల అమ్యూజ్‌మెంట్ రైడ్స్, కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక వినోద కార్యక్రమాలు, ఫుడ్ కోర్ట్, షాపింగ్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. వారాంతాల్లో



ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వయసుల వారికి వినోదం, కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరమైన సమయం, రుచికరమైన ఆహారం, షాపింగ్‌తో తెలంగాణ ఉత్సవ మేళా సందర్శకులకు ప్రత్యేక



అనుభూతిని అందించనుంది. ఈ మేళాను నగరవాసులు, మెదిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## రైతు బీమా పథకం పునర్ ప్రారంభం రైతు బీమాబిరైతు భరోసా.

**పోర్టల్ లో 2026బి27 సంవత్సరానికి రైతుల మరణాలను నమోదు చేసే సౌకర్యం ప్రారంభించబడింది.**

తెలుగు జ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 9 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ న్యూస్, రైతు బీమా పథకం పునర్ ప్రారంభం రైతు బీమాబిరైతు భరోసా పోర్టల్ లో 20 26బి27. సంవత్సరానికి రైతుల మరణాలను నమోదు చేసే సౌకర్యం ప్రారంభించబడింది అని కొండాపూర్ మండల వ్యవసాయ అధికారి ( ఏవో) తెలియజేశారు. ఈ నేపథ్యంలో, 14 బి0 8 బి20 26, లేదా తర్వాత సంభవించిన రైతుల మరణాలను పోర్టల్ లో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి( ఏ ఈ ఓ) దగ్గర నమోదు చేసుకోవాలి అని తెలియజేశారు.
1, సంబంధిత రైతుకు 20 25బి26 పాలసీ సంవత్సరానికి చెల్లుబాటు అయ్యే ఎల్ ఐ సి ఐడి ఉండాలి అని అన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**
ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

## చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వానికి సర్పంచ్ ల అరెస్టులే సమాధానమా?



**ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?**
**ఇది కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరి.**

తెలుగు జ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 9 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.



సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం అనంతరం, కొత్తపల్లి, నాగిరెడ్డి గూడెం గ్రామాల సర్పంచ్ లను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం, ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను అణచి వేయడానికి మాత్రం పోలీసులను ఉపయోగించుకోవడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తున్న సర్పంచ్లను అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థతను బయట పెట్టుకుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కులను కాల రాయడం దుర్మార్గమైన చర్యని సర్పంచ్ లు పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్టు చేస్తే సమస్యను పరిష్కారం కావు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచి వేయాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. సర్పంచులు కొమ్ము శీను, సూరారం సత్తయ్య, గోవర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, వార్డు సభ్యులు జి సాయి రెడ్డి, భాస్కర్ గౌడ్ సీనియర్ నాయకులు, గోపాల్ ముదిరాజ్, పి లక్ష్మణ్, మహేష్ యాదవ్, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాపిరెడ్డినగర్‌లో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**శ్రీ వీరాంజనేయ శివాలయంలో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు**

కూకట్ పల్లి, సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి) :

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ మండపంలో నిర్వహించిన ఈ వ్రత కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. వేద పండితులు పరమకుష వేంకట చార్యులు, గంగాధర్ ఆధ్వర్యంలో వేదమంత్రాల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఈ సందర్భంగా మహిళలు తమ కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శ్రేయస్సు కలగాలని వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. సామూహికంగా నిర్వహించిన వ్రతంతో ఆలయ పరిసరాల్లో భక్తి భావం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్ల చంద్రారెడ్డి, ప్రభాకర్, పి. శంకర్‌రెడ్డి, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సెక్యూరిటీ కార్మికులకి రావలసిన వేత్తనం ఇప్పించిన




**బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**

కూకట్ పల్లి, సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి) :

బొల్లారం ఇండస్ట్రీ ఏరియాలో సెక్యూరిటీ కాంట్రాక్టర్ టీఎం మిశ్రా అనే సెక్యూరిటీ కాంట్రాక్టర్ గత 2022లో ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్ కు రావాల్సిన 50000/- రూపాయలు సెక్యూరిటీ గాడ్స్ కు ఇవ్వాల్సి ఉండగా అవి కంపెనీ సెక్యూరిటీ కాంట్రాక్టర్ పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఇవ్వకపోవడంతో గత కొన్ని రోజుల నుంచి కంపెనీ లో సెక్యూరిటీ గాడ్స్ గా పనిచేస్తున్న ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్ విధులు మానేశారు. ముగ్గురు సెక్యూరిటీ గాడ్స్ కు మొత్తం రావలసిన గత సంవత్సరం 2022, లో సెక్యూరిటీ గాడ్స్ ముగ్గురీ కి కలిపి మొత్తం 50వేల/- రూపాయలు రావాల్సి ఉండగా సెక్యూరిటీ గాడ్స్ కి వేతనం ఇవ్వకుండా సెక్యూరిటీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పంపించేవారు. సెక్యూరిటీ కార్మికులకి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి సెక్యూరిటీ మిత్రులు ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి కార్యాలయం వద్దకు వెళ్లి సెక్యూరిటీ గాడ్స్ కి జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన "బొల్లారం ఇండస్ట్రీ లోకి వచ్చి" కంపెనీతో మాట్లాడి ఆ ముగ్గురు డబ్బులు సెక్యూరిటీ కాంట్రాక్టర్ కు ముగ్గురు గాడ్స్ 50వేల రూపాయలు రావాల్సి ఉండగా వెంటనే మాట్లాడి, సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన వేతనాన్ని మొత్తం సెక్యూరిటీ కాంట్రాక్టర్ కి ఇప్పించడం జరిగింది. సెక్యూరిటీ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.








డా., డీ ప్రేమానందం. రాష్ట్ర నాయకులు.
ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్.

తెలుగు జ్యోతి
అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక



# కేటీఆర్‌పై పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ చర్యలు తీసుకోవాలని డిమాండ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 09: (తెలుగు జ్యోతి) :



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాలానగర్ ఏసీపీకి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి వంటి అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ మాటల్లో హుందాతనం, సంయమనం పాటించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కేటీఆర్ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మూసాపేట ఏఎంసీ చైర్మన్ కొండమీద పుష్పారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు పులి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి ఏ. మధుమోహన్, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్‌గౌడ్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కే. క్రాంతి, ప్రశాంత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చందర్‌రావు, కూకట్‌పల్లి అధ్యక్షుడు కే. నాగరాజు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీటకోరు కృష్ణ, భరత్‌నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి ఏ. రాజు అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాళోజి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తెలుగు జ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 9 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.



సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి టౌన్ న్యూస్ సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాళోజి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా కవి, తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి బి ఆర్ ఎస్ వేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాలోజి నారాయణరావు తన కలం ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, సామాజిక రుగ్మతులపై నిరంతరం పోరాడాలని నాయకులు కొనియాడారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతా సాయినాథ్ బి ఆర్ ఎస్ రాష్ట్ర యువ నాయకులు, కాసాల బుచ్చిరెడ్డి మాజీ సిడిసి చైర్మన్, జీవి శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్, బి ఆర్ ఎస్ నాయకులు కసిని శ్రీకాంత్,ఎండి మసూద్, వెంకటేష్ , నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొని కాళోజికి ఘన నివాళులు అర్పించారు.

# పార్టీలో పదవులు రానివారు నిరాశ చెందవద్దు , పదవులు వచ్చినా రాకున్నా నేను అందరిని గుర్తిస్తా.







త్వరలోనే మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్తతో వన్ టూ వన్ మాట్లాడతా.

తెలుగు జ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 9 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి నియోజకవర్గంలోని 4 మండలాలు, 2 మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశంలో తూర్పు జగ్గారెడ్డి. సంగారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం బుధవారం సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ లో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించారు. అలాగే ఎస్సీ, ఎస్ టి, మైనార్టీ, మహిళా, ఐ ఎన్ టి యు సి, కాంగ్రెస్ కిసాన్ సెల్ తో పాటు ఇతర ఫ్రెంట్ ల ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు. ఈ సందర్భంగా తూర్పు జగ్గారెడ్డి సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ పార్టీకి పదవులు వచ్చినవారు, రానివారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. వాటిలో పదవులు రానివారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తానని తూర్పు జగ్గారెడ్డి అన్నారు. అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# జానకీపురం గ్రామ పంచాయతీలో ఓటర్ నమోదు సర్ ప్రోగ్రామ్ నోటీసుల పరిశీలన....

బోనకల్ సెప్టెంబర్ 09 తెలుగు జ్యోతి ప్రతినిధి మాగి ముఖేష్:

మన జానకీపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఇదివరకు చేపట్టిన 'సర్ ప్రోగ్రామ్' ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా, అధికారుల నుంచి నోటీసులు అందుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం సజావుగా సాగింది. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ పార్టీల నాయకులు విచ్చేసి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీ పి. ఏడుకొండలు, జానకీపురం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మరియు ఉప సర్పంచ్ గంగాధర భూపతి.
కాంగ్రెస్ పార్టీ తరఫున గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు, బిఎల్‌ఓ చిలక శివ, ఐకేపీచిలక వరమ్మ పంజి రమేష్, చాటు కోటేశ్వరరావు, యంగల ప్రేమానందం గార్లు మరియు ఇతర స్థానిక నాయకులు. నోటీసులు వచ్చిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంబంధిత అసలు ధ్రువపత్రాలను అధికారులకు చూపించి పరిశీలన పూర్తి చేసుకున్నారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో ఈ ఓటర్ నమోదు మరియు ధ్రువీకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయిందని అధికారులు తెలిపారు.



## గంజాయి దారి మధ్యలోనే బ్రేక్! బుల్లెట్‌పై ఇద్దరికి పోలీసుల చెక్..

2.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 8, తెలుగు జ్యోతి రిపోర్టర్ మన్నే ప్రసాద్

ఇస్నాపూర్ శివారులో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 2.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం కాగా, ఇద్దరిని అరెస్ట్ చేశారు. గంజాయి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.సెప్టెంబర్ 8న సాయంత్రం 6 గంటల సమయంలో ఎన్‌హెచ్--65 రహదారిపై రాయల్ ఓక్ ఫర్నిచర్ షాపు వద్ద ఎస్ఐ పి. విద్యాచరణ్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ 12 ఈజే 4244 నంబర్ బుల్లెట్‌పై వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా.. వారి వద్ద ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టయిన వారిని.కురుపూడి గణపతి (33), చిన్నసైబు మల్లేశం (32)గా పోలీసులు గుర్తించారు.**

పోలీసుల ప్రకారం, గణపతి తన బావమరిది వరుణ్ ద్వారా ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో మల్లేశంతో కలిసి గంజాయిని మహేశ్వరం కాలేజీ రోడ్డు ప్రాంతానికి తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు.

**వారి వద్ద నుంచి 2.8 కిలోల ఎండు గంజాయి, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఐఫోన్, వివో మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.**

ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టం--1985 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు, అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు

## బిరాష్ట్రపతి నిలయంలో త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థికి ప్రతిభా పురస్కారం



బిసాంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో బి. జతిన్ కుమార్ రెడ్డికి మూడో స్థానం

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి ప్రతినిధి)

చింతల్‌లోని త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి బి. జతిన్ కుమార్ రెడ్డి సాంస్కృతిక పోటీలో ప్రతిభ చాటుతూ పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చాడు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన లి"తెలుగు భాషా, సాంస్కృతికఉత్సవం 2026"లిలోభాగంగానిర్వహించిన సాంప్రదాయ వస్త్రధారణ పోటీలో జతిన్ కుమార్ రెడ్డి మూడో బహుమతి సాధించాడు.ఆరో తరగతి చదువుతున్న జతిన్ కుమార్ రెడ్డి సంప్రదాయ వస్త్రధారణతో పాటు తన ప్రత్యేక ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాడు. పోటీలో ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో మాజీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసారథి చేతుల మీదుగా జతిన్ కుమార్ రెడ్డి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నాడు. కార్యక్రమంలో సెంట్రల్ సైన్స్ ఆఫీసర్ (సీఎస్‌ఓ) సుబ్బారావు, సెంట్రల్ రిసోర్స్ ఆఫీసర్ (సీఆర్‌ఓ) వెంకటరావు పాల్గొని విద్యార్థిని అభినందించారు. జతిన్ కుమార్ రెడ్డి సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శివకీర్తన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక వేదికలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు.జతిన్ కుమార్ రెడ్డి ప్రతిభను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి ప్రతిభతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని పేర్కొంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి :

భారత మాజీ రాష్ట్రపతి ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతినీ పురస్కరించుకొని శేరిలింగంపల్లి మండల బి - స్మార్ట్ బడ్జెట్ మ్యానేజ్ మెంట్ స్కూల్స్ అద్వర్యంలో బుధవారం రోజు మాదాపూర్ లోని సీసీ ఆర్ టి లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాదాపూర్ ఎసిపి చంద్రశేఖర్ రెడ్డి హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డా. రేవతి, స్టేట్ ప్రెసిడెంట్. శేఖర్ రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్ రావు, జిల్లా సెక్రటరీ. భరత్ కుమార్, మండల ప్రెసిడెంట్. నిజాం అలీఖాన్, సెక్రటరీ. వెంకటేష్, ట్రెజరర్. హిమబిందు, కిరణ్ కుమార్, భీష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223

# బొల్లారం అభివృద్ధికి కమిషనర్ భరోసా






**వన్ డే.. వన్ వార్డ్‌లో ప్రజా సమస్యలపై సృజన ఐఏఎస్ క్షేత్రస్థాయి పరిశీలన**

బొల్లారం, సెప్టెంబర్ 9: తెలుగు జ్యోతి రిపోర్టర్ మన్నె ప్రసాద్

ప్రజా పాలన--ప్రగతి నివేదిక 'వన్ డే.. వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి సృజన ఐఏఎస్ బుధవారం ఉదయం బొల్లారం మున్సిపాలిటీని సందర్శించారు. పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, వీధిలైట్లు తదితర అభివృద్ధి అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఆమె చర్చించారు. బొల్లారం వెనుకబడిన ప్రాంతంగా ఉన్నందున ఇక్కడి పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతూ, సర్కిల్ పరిధిలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నందుకు కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌లకు ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత తాగునీటి సరఫరా, గంజాయి--మాదకద్రవ్యాల నియంత్రణ, దొంగతనాల నివారణ, వీధిలైట్ల ఏర్పాటు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల నియంత్రణ, పార్కులకు ప్రహరీ గోడలు, పేదల ఇళ్లకు ఇంటి నంబర్ల కేటాయింపు, వైకుంఠధామంలో శవకర్మల చార్జీల నియంత్రణ, రోడ్లపై అక్రమ వ్యాపార నిర్మాణాల తొలగింపు వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి కనెక్షన్లు, ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్టేడియం నిర్మాణం, బొల్లారం ప్రజలకు ప్రత్యేక ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్య సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య సిబ్బంది పెంపు, పార్కు స్థలాల అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, మురుగునీటి కాలువల నిర్మాణం తదితర అంశాలపై వినతులు సమర్పించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించారు. సమస్యలపై వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, అత్యవసరమైన పనులకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నవంబర్‌లో జరిగే తదుపరి 'వన్ డే.. వన్ వార్డ్' కార్యక్రమం నాటికి ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని అధికారులకు సూచించారు. బొల్లారంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజాప్రతినిధులు--ప్రజల ఐక్యతపై జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ కమిషనర్‌కు వివరించగా ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ ఉద్యోగులు పారదర్శకంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వి. చంద్రారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, పుల్లగుర్ల జైపాల్‌రెడ్డి, ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు, జనరల్ సెక్రటరీ రాయుడు, ఆనంద్ కృష్ణారెడ్డి, పుల్లగుండ్ల నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ సాయి కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈఈ వెంకటరమణ, ఏసీపీ ప్రసాద్, ఏఎంసీ నరసింహులు, ఏఈలు తిరుమలేష్, సునీల్, ఎలక్ట్రికల్ ఏఈ రవీందర్, వాటర్ వర్క్స్ డీ. శివ, హెడ్‌మాస్టర్ మంగీలాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి, శంకర్ పై బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టండి!...



**బోనకల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మండల కమిటీ ఫిర్యాదు...**
**రాజకీయ కక్షసాధింపుల కోసం పోలీసు వ్యవస్థను వాడుకోవడం ప్రజాస్వామ్యానికే ప్రమాదం: బీఆర్‌ఎస్ నాయకులు...**

బోనకల్ సెప్టెంబర్ 09 తెలుగు జ్యోతి ప్రతినిధి మాగి ముఖేష్;

షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో పాటు ఫిర్యాదులో పేర్కొన్న ఇతరులపై బిఎన్‌ఎస్--2023లోని సంబంధిత సెక్షన్లతో పాటు సెక్షన్ 61 కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బీఆర్ఎస్ బోనకల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు అధికారికంగా ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ సీనియర్ నాయకులు పారా ప్రసాద్ ఈ ఫిర్యాదు ప్రతిని పోలీసులకు అందజేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, సాక్ష్యాలను పరిశీలించి, ముఖ్యమంత్రితో సహా బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుట్రలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపులకు పోలీసు వ్యవస్థను వేదికగా మార్చవద్దని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే కుట్రలు, బెదిరింపులు, అక్రమ చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని స్పష్టం చేశారు.? "అధికారం శాశ్వతం కాదు.. చట్టం, ప్రజాస్వామ్యం మాత్రమే శాశ్వతం. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎవరైనా కుట్రలకు పాల్పడితే భవిష్యత్తులో ప్రజల ముందు జవాబు చెప్పాల్సిందే" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ, వేమూరి ప్రసాద్, కాకాని శ్రీనివాస్, కొనకంచి నాగరాజు, కాటేపల్లి రాజశేఖర్, వెంగళ కనకయ్య, గొల్లమందల రాజారావు, తేళ్లూరి రమేష్, గంగుల పుల్లయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొలన్ హనుమంత రెడ్డి మాతృమూర్తి అంత్యక్రియలకు హాజరైన నాయకులు

**బికొలన్ సులోచనకు పలువురు నాయకుల నివాళి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**
**బిఅంత్యక్రియలకు టీపీసీసీ లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్, మేడ్చల్ మల్కాజ్గిరి. జిల్లా నాయకులు గ్యార శ్రీనివాస్ హాజరయ్యారు.**

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 09 (తెలుగు జ్యోతి ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హనుమంత రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచన గారు స్వర్గస్తులయ్యారు. ఆమె అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, రాజకీయ నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు హాజరై సులోచన పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియలకు టీపీసీసీ లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్, మేడ్చల్మల్కాజిగిరి జిల్లా నాయకులు గ్యార శ్రీనివాస్ హాజరయ్యారు. సులోచన పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం కొలన్ హనుమంత రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయనఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు సాబేరా బేగం, బహుజన మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ జ్యోతి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కొండపల్లి రజిత పటేల్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సీత, మీనా తదితరులు పాల్గొని సులోచనకు నివాళు లర్పించారు. కొలన్ సులోచన మృతి పట్ల నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కొలన్ హనుమంత రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచన కన్నుమూత




**కొలన్ సులోచన పార్థివ దేహానికి నివాళు లర్పించిన పలువురు నాయకులు**

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి సెప్టెంబర్ 9

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచన బుధవారం ఉదయం పరమపదించారు. ఆమె పార్థివదేహాన్ని బాచుపల్లి నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆమె పార్థివ దేహానికి నియోజకవర్గపు వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, ప్రజలు, పాల్గొని వారికి నివాళులర్పించారు. కొలన్ సులోచన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు నాయకులన్నారు.

## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ,

# చింతకానిలో ఘనంగా పోషకాహార వారోత్సవాలు...



**ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ కిలారు మనోహర్ బాబు...గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అత్యంత ఆవశ్యకం: అంగన్వాడీ సేవలపై విస్తృత అవగాహన...**

చింతకాని మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వారోత్సవాల తొలి రోజు కార్యక్రమానికి స్థానిక గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అనేక రకాల పౌష్టికాహార పదార్థాలను, ఆరోగ్యకరమైన సంక్షేమ సేవలను ఉచితంగా అందిస్తోందని, ఈ పథకాలను అర్హులైన వారందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**చిన్నారుల వికాసానికి సమతుల్య ఆహారం, ప్రీ-స్కూల్ విద్య...**

పిల్లల శారీరక మరియు మానసిక పెరుగుదలకు చిన్నతనం నుంచే సమతుల్య ఆహారం అందించడం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు. పోషకాహారంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ప్రాథమిక ప్రీ-స్కూల్ విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోలా ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, సామాజిక ఆరోగ్య అధికారి దేవా, వార్డు సభ్యులు కిలారు బాబురావు, వేముల కొండలరావు, ఏఎన్ఎం రజినీలతో పాటు అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు మరియు చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనాథ వృద్ధుడికి కుటుంబంగా ఎండీఆర్ ఫౌండేషన్





**చివరి ప్రయాణంలోనూ వీడని మానవత్వం..**
**గౌరవప్రదంగా అంత్యక్రియలు**

ఇంద్రేశం: సెప్టెంబర్ 9 తెలుగు జ్యోతి రిపోర్టర్ మన్నె ప్రసాద్

జీవితంలో తోడు లేక.. చివరి మజిలీలోనూ తనవారెవరూ లేక.. రోడ్డుపైనే అనాథగా జీవించిన ఓ వృద్ధుడికి ఎండీఆర్ ఫౌండేషన్ కుటుంబ సభ్యుడిగా నిలిచింది. చివరి ప్రయాణంలోనూ మనిషికి గౌరవం దక్కాలనే మానవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించింది. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో రోడ్డుపై అనాథగా జీవిస్తున్న ఓ వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో విషయం పోలీసుల దృష్టికి రావడంతో వెంటనే ఆయనను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌ను సంప్రదించారు. అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తూ మానవతా సేవలు అందిస్తున్న ఫౌండేషన్.. ఈ వృద్ధుడిని కూడా తమ కుటుంబ సభ్యుడిగానే భావించింది. తనవాళ్లు ఎవరూ లేకపోయినా.. చివరి వీడ్కోలుకు మాత్రం ఎవరినీ వెతకాల్సిన పరిస్థితి రాలేదు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆపదలో అండగా నిలవడం మాత్రమే కాదు.. చివరి ప్రయాణంలోనూ మనిషికి గౌరవం కల్పించడమే నిజమైన మానవత్వం అనే సందేశాన్ని ఎండీఆర్ ఫౌండేషన్ మరోసారి చాటిచెప్పింది.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం



భారత్– రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్–57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.

**ఎస్–400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ**

మిలిటరీ–టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్–400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్–400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

**'సుఖోయ్–57' స్టెల్త్ ఫైటర్ జెట్**

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్–57' (రాబ–57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

**బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్**

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది.

దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్–రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం



**ముంబై :** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది. అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం. ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది. త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

## షాద్నగర్ ఎమ్మెల్యే కె శంకరయ్య పై ఫిర్యాదు చేసిన టీఆర్ఎస్ నాయకులు




**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంకరయ్య పై చర్యలు తీసుకోవాలి**

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి సెప్టెంబర్ 9

నిజాంపేట సర్కిల్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ లో షాదనగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె శంకరయ్య తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె చంద్రశేఖర్ రావు చావు కోరుకుంటు న్నాము అని వారి నివాసం వద్ద సావు డప్పులు కొట్టిస్తున్నాము అని విచక్ష పూరిత ,క్రూరమైన భాష వాడినందుకు బాచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంకరయ్య పై ఆయనను ప్రేరేపించిన సీఎం రేవంత్ రెడ్డి పై బాచుపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమములో నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ గారు, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు , మాజీ కోఆప్షన్ సభ్యులు, మాజీ వార్డ్ మెంబర్లు సీనియర్ నాయకులు,యువ నాయకులు,మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.





తెలుగు జ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 9 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కొండాపూర్ మండలం అధ్యక్షులుగా పి మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా జి నర్సింలు, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ జగ్గన్న గారి, 2, ఉపాధ్యక్షులుగా ు సురేష్, మండల ప్రధాన కార్యదర్శిగా ఎండి మనసుర్, 2 బి నగేష్, 3 ప్రధాన కార్యదర్శిగా , ప్రధాన కార్యదర్శిగా,సి నర్సింలు,4 ప్రధాన కార్యదర్శిగా బి,ప్రభుదాస్, కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్ గౌడ్ ,2 యు మంజుల, 3 బుచ్చయ్య, 4 కార్యదర్శి ఎం జైపాల్, 5 జే రాములు, 6 కే అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా 1 బి హనుమంత్ రెడ్డి, 2 కే నగేష్, 3 అమృతమ్మ, 4 ఎస్ మహేశ్వరి, 5 పెద్దోడి అంజమ్మ, 6 కే సంధ్యారాణి, 7, జి లక్ష్మి. కొండాపూర్ మండలం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీని నియమించారు. ఈ సమావేశంలో టిపిసిసి పార్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, మరియు డిసిసి అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి లు పాల్గొన్నారు.
కొండాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

# ఆ రెండూ కుట్రలే!

-మొదటిపేజీ తరువాయి

విచారణాధికారిగా నియమిస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం శాసనసభలో సీఎం ఈ మేరకు ప్రకటన చేశారు. కేసీఆర్ నివాసం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన దళితులను అవమానించేలా ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసినట్టుగా చెబుతున్న వ్యవహారంపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ చర్చను ముగిస్తూ ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు.

**కోర్టులు బెయిల్ ఇచ్చినా ప్రజలు బెయిల్ ఇవ్వరు**

'చట్టాలు, సెక్షన్లను అడ్డుపెట్టుకుని కొంతమంది కోర్టుల నుంచి బెయిల్ పొందవచ్చు. కానీ తెలంగాణ సమాజం మాత్రం వారికి బెయిల్ ఇవ్వదు. జరిగిన తప్పును అంగీకరించి క్షమాపణ చెబితే కిరీటం ఊడిపోతుందా? స్థాయి తగ్గుతుందా? సభాపతిని అవమానించిన విషయంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుంది. చట్టపరంగా శిక్షించే వరకు వెనక్కి తగ్గబోదు. సభాపతి పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌కుమార్ మనసుకు గాయం చేసేలా ఉన్మాదంతో వ్యవహరించిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించే స్థాయికి వెళ్లారు. మహిళలను శక్తిగా కొలిచే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటుంటుందా? సభలో అధికారులపై దాడులు చేయడంతోపాటు స్పీకర్ కుర్చీని అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

**దళితులపై అవమానకర చర్యలు**

స్పీకర్‌ను అవమానించిన ఘటనకు నిరసనగా కొంతమంది ప్రజాస్వామ్యవాదులు ఫామ్‌హౌస్ వద్ద డప్పు దరువులతో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపారే తప్ప ఎలాంటి ఉన్మాదానికీ పాల్పడలేదు. దళిత సోదరులు తమ మనసులోని భావాలను వ్యక్తం చేసేందుకు డప్పును ఒక సాధనంగా ఉపయోగిస్తారు. నిరసన తెలిపిన దళిత ప్రతినిధులను పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై



ఉంది. కానీ అందుకు భిన్నంగా వ్యవహరించి, దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించడం ద్వారా దళితనులను తీవ్రంగా అవమానించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తే.. మరి దొరతనం, అహంకారంతో ఉన్న ఆ నేతల మనసుల్లో పేరుకుపోయిన అంటరానితన భావజాలాన్ని ఎలా శుద్ధి చేస్తారు? యాసిడ్‌తో కడగాలా? దళితుడు దుక్కి దున్ని పంట పండిస్తేనే అందరి కడుపులు నిండుతున్నాయి. మనకు అన్నం పెడుతున్న వారిని ఇంతగా అవమానిస్తారా? దళితులను అవమానపరుస్తూ వారిని కించపరిచిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలి. అప్పుడే వారికి దళితులు ఎదుర్కొంటున్న వివక్ష ఎలాంటిదో తెలిసొస్తుంది.

**ఖర్గేనూ అవమానించారు..**

సమాజంలో అశాంతిని ప్రోత్సహించి రెండు వర్గాల మధ్య వైరాన్ని పెంచాలని ప్రయత్నిస్తున్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నవారు ధనబలంతో వ్యవస్థలను లొంగదీసుకోవాలని చూస్తున్నారు. మేము మాత్రం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ దేశంలోని కోట్లాది ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించింది. కర్ణాటకలోని ఓ చిన్న గ్రామంలో పుట్టి, రజాకార్ల దాడుల్లో తల్లిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్న నేత మల్లికార్జున ఖర్గేను అవమానించడం బాధాకరం. ఉత్తరాఖండ్‌లోని ఓ మైదానంలో ఖర్గే సభలో పాల్గొన్న అనంతరం ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ అదే మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం హేయమైన చర్య. ఆ ఘటనను ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది. తాజాగా తెలంగాణ వేదికగా బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వ్యవహారానికి తెరలేపింది.

**వారిని వదిలే ప్రసక్తే లేదు..**

విద్యా రంగంలోని అక్రమాలు, ధరణి అక్రమాలు, 22ఏ రాద్ధాంతంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం భావించింది. ఈ అంశాలపై చర్చ జరిగితే గత పదేళ్లలో జరిగిన దురాగతాలు, రాష్ట్రంపై పేరుకుపోయిన అప్పుల గురించి ప్రజలకు అవగాహన కలుగుతుందనే భయంతోనే చర్చను అడ్డుకునేందుకు ఈ కుట్రలు పన్నారు. సభను అడ్డుకోవడమే కాకుండా స్పీకర్‌ను అవమానించే స్థాయికి వెళ్లడం అత్యంత దురదష్టకరం. కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి బాటలు వేసింది. కాంగ్రెస్ విధానం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడమే..' అని సీఎం స్పష్టం చేశారు. స్పీకర్ మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తి లేదని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే విషయంలో ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్

**హైదరాబాద్ :** భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు. అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల పొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్,



లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలో భవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌వేకు ఇరువైపులా మూడు లేన్ల సర్వీస్ రోడ్లు, రెండు మీటర్ల గ్రీన్‌బెల్ట్, మూడు మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్, రెండు మీటర్ల ఫుట్‌పాత్, రెండు మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇది కేవలం వాహనాల రాకపోకలకు మాత్రమే కాకుండా పాదచారులు, సైక్లిస్టులు, స్థానిక రవాణాకు కూడా ఉపయోగపడే సమగ్ర రహదారి వ్యవస్థగా రూపుదిద్దుకోనుంది.రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే భారత్ ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ నగరానికి అనుసంధానం మరింత మెరుగుపడనుంది. రహదారి వెంట పారిశ్రామిక, వాణిజ్య, నివాస అభివృద్ధికి ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా వేగవంతమైన రవాణా సదుపాయాలతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు బిగ్ బూస్ట్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# కాంగ్రెస్‌లో రేవంత్‌కు ఫుల్ పవర్స్

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియా ముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు.ఇటీవలే ఒకే రోజు ఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి. ఆదిలాబాద్ వివాదంలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్ రెడ్డిల వివరణ కోరారు. ఎంతటి సీనియర్ నేతలైనా సరే, బహిరంగ వివాదాలకు దిగితే సహించేది లేదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారుఈ కఠిన వైఖరి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి ఢిల్లీ అధిష్టానం పూర్తి స్థాయిలో



స్వేచ్ఛను ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ అంచనాల వేళ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్లు ఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ తర్వాత సీఎం సమావేశాల్లో పాల్గొని లైన్‌లోకి రావడం ద్వారా ఒక స్పష్టమైన సంకేతం వెళ్లింది. తిరుగుబాటు స్వరాలు వినిపిస్తే మంత్రి పదవులే కాదు, పార్టీలో ఉనికికే ప్రమాదమనే విషయాన్ని ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్టానం ప్రాక్టికల్‌గా రుజువు చేసింది.ఇకపై ఎవరూ నోరెత్తకుండా రేవంత్ రెడ్డి చెప్పినట్లే వింటారా? అనే కోణంలో చూస్తే.. ఇది కేవలం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలోనే మల్లు రవి ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడే బాధ్యతను రేవంత్ రెడ్డి-పీసీసీలకే అప్పగించడంతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ గీత దాటితే చర్యలు ఖాయమని అర్థమైపోయింది. కాంగ్రెస్ లాంటి కల్చర్ ఉన్న పార్టీలో అసమ్మతిని నూటికి నూరు శాతం అణచివేయడం సులభం కాకపోయినా, ఈ కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగానైనా నేతలు సైలెంట్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి టీమ్ ముందుకు సాగుతున్న తరుణంలో, ఈ క్రమశిక్షణా అస్త్రం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తీసుకొస్తుందో లేదో వేచి చూడాలి.

## కోహెడ'కు రూ.637.70 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు. వీటితోపాటు షెడ్--4, కర్బూజ తదితర పండ్ల విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్, రైతుల కోసం కిసాన్ రిటైల్ మార్కెట్, వాహనాలు నేరుగా లోపలికి వెళ్లి సరుకులు తరలించే సదుపాయం, ప్రాంగణం వెలుపల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మార్కెట్ నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాంకేతిక అనుమతులు, టెండర్ల ప్రక్రియ, నిర్మాణ పనుల పర్యవేక్షణ తదితర బాధ్యతలను ఆ శాఖ నిర్వహించనుంది.

**రైతులకు ఆధునిక సదుపాయాలు**

ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే పండ్ల ఉత్పత్తిదారులకు ఆధునిక మార్కెటింగ్ మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పండ్ల విక్రయాలు, నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు మెరుగైన సదుపాయాలు కల్పించనున్నారు. తద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, మార్కెటింగ్ వ్యవస్థ ఆధునీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోహెడ సమగ్ర పండ్ల మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ రంగంలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

-మొదటిపేజీ తరువాయి

మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. "మేం సభలో అందరు ఉండాలని కోరుకునే వాళ్లం అధ్యక్ష. సభలో జరిగే చర్చల్లో పాల్గొని సూచనలు ఇస్తే తీసుకుంటాం. మేం ఎంత చెప్పిన దాదాపు గంటసేపు నుంచి వారు వినడం లేదు. అదే విధంగా సభను అడ్డుకుంటున్న తరుణంలో బీఆర్?ఎస్? సభ్యులను ఈ సెషన్?నుంచి సస్పెండ్ చేయాలని కోరుతున్నా"

**సభ సజావుగా నడిచేలా**

సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు.

**న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకు**

నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

## శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

-మొదటిపేజీ తరువాయి

హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.

**తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం**

పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. "శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం"

## సర్కార్ వారి రైడింగ్ యాప్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమిషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమిషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్స్యూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.



# బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు.. మేకోవర్ చూస్తే షాకే!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దేవర' తర్వాత కొరటాల శివ రూపొందించనున్న ఈ చిత్రం బాలయ్య కెరీర్‌లో మరో ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన వార్తలు ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ ఈ సినిమాలో ఇప్పటివరకు చూడని సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారనే టాక్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణను మాస్ యాక్షన్ హీరోగా అద్భుతంగా ప్రెజెంట్ చేయడంలో దర్శకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంటారు. అయితే కొరటాల శివ మాత్రం ఈసారి బాలయ్యను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా.. ఆయన పాత్రలో కొత్త షేడ్స్‌ను చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది. సామాజిక అంశాలు, కుటుంబ భావోద్వేగాలను కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మేళవించడం కొరటాల శివ శైలి. ఈ సినిమాలోనూ అదే తరహాలో యూనివర్సల్ ఎమోషన్‌తో కూడిన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి షెడ్యూల్‌లో బాలకృష్ణ పాల్గొనరనే టాక్ వినిపిస్తోంది.బాలయ్య లేకుండా కీలకమైన సన్నివేశాలతో పాటు భారీ యాక్షన్ ఎపిసోడ్లను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది.దాదాపు 15 రోజుల పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే విషయంపై కొంతకాలంగా ఆసక్తి కొనసాగుతోంది. తాజాగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.వైద్యురాలిగా పనిచేసిన ఐశ్వర్య లక్ష్మి.. నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చి మలయాళం, తమిళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు'లోనూ ఆమె కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ సరసన నటించే అవకాశం దక్కితే ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర కోసం నటి ఐశ్వర్య రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. ఆమెను రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కాకుండా లేడీ విలన్‌గా సరికొత్త నెగెటివ్ షేడ్‌లో చూపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే హీరోయిన్, లేడీ విలన్ పాత్రలకు సంబంధించిన ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## రామాయణకు గాడ్జిల్లా మైనస్ జీరో దెబ్బ
### ఐమ్యాక్స్ స్క్రీన్ల కోసం గ్లోబల్ వార్




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ: పార్ట్ 1' ఒకటి. భారతీయ పురాణ ఇతిహాసం రామాయణాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా విజువల్ గ్రాండియర్‌గా తెరకెక్కుతోంది. నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.అదే తేదీన జపాన్‌కు చెందిన మరో భారీ చిత్రం 'గాడ్జిల్లా మైనస్ జీరో' కూడా అంతర్జాతీయ మార్కెట్లలోకి రాబోతోంది. 'గాడ్జిల్లా మైనస్ వన్'కు కొనసాగింపుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తకాషి యమజాకి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. దీంతో రామాయణ--గాడ్జిల్లా మధ్య పోటీ ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రెండు పెద్ద సినిమాలు ఒకే రోజు విడుదలైతే థియేటర్లు, ఆడియెన్స్, బాక్సాఫీస్ వసూళ్ల కోసం పోటీ ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. కారణం.. రెండు సినిమాలూ ప్రీమియం ఐమ్యాక్స్ అనుభూతిని దృష్టిలో పెట్టుకుని రూపొందిన భారీ విజువల్ చిత్రాలు కావడమే. ముఖ్యంగా 'గాడ్జిల్లా మైనస్ జీరో'ను జపాన్‌లో ఐమాక్స్ కోసం ప్రత్యేకంగా చిత్రీకరించిన తొలి జపనీస్ ప్రొడక్షన్‌గా అధికారికంగా ప్రచారం చేస్తున్నారు. ఐమాక్స్ స్క్రీన్లపై విజువల్స్, సౌండ్‌ను మరింత విస్తృతంగా ఆస్వాదించేలా సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం చెబుతోంది.ఇక 'రామాయణ' కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో.. ముఖ్యంగా నార్త్ అమెరికా వంటి ఓవర్సీస్ మార్కెట్లలో ఐమాక్స్ స్క్రీన్ల కేటాయింపు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. 'గాడ్జిల్లా మైనస్ జీరో' తాజా ట్రైలర్ విడుదలైన తర్వాత ఈ పోటీపై చర్చ మరింత పెరిగింది. ట్రైలర్‌లో భారీ విజువల్స్, గాడ్జిల్లా విధ్వంసం, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపించడంతో సినిమాపై అంతర్జాతీయంగా ఆసక్తి పెరుగుతోంది.


## రూ.200 కోట్ల 'ఇరుముడి' ఓటీటీలోకి..
### రవితేజ బ్లాక్‌బస్టర్ ఎక్కడ, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అంటే?

ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించాయని టాక్ వచ్చింది.

## ఘనంగా 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంచ్.. ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్!



టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన యువ నటీనటులు, కొత్త ఆలోచనలతో వస్తున్న టెక్నీషియన్లను ప్రోత్సహించే చిత్రాలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ కోవలోనే యూత్ మరియు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఏకకాలంలో అలరించే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోన్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". వివిఫై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించారు. రవి లోకిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఖాన్ దురాని, సాహితి ఆవంచ జంటగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ రాజవంశీ అత్యంత భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖ స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్, ప్రముఖ నిర్మాతలు కేఎల్ దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. ఈ వేడుకలో చిత్ర బృందం పంచుకున్న ఆసక్తికర విశేషాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. సమాజంలో నేడు సర్వసాధారణంగా మారుతున్న భార్యాభర్తల బంధాలు, వాటి మధ్యలోకి ఒక మూడో వ్యక్తి ప్రవేశం వల్ల వచ్చే మనస్పర్థలు, ఆ సవాళ్లను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమను, బంధాన్ని ఎలా నిలబెట్టుకున్నారు అనే సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఎక్కడా అసభ్యతకు తావులేకుండా, కుటుంబం అంతా కలిసి నవ్వుతూ, భావోద్వేగానికి గురవుతూ చూసేలా ఈ క్లీన్ ఫ్యామిలీ అండ్ లవ్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. ఈ వేడుకలో నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ, తాము యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినప్పటికీ సినిమాపై ఉన్న మక్కువతో గతంలో '24 కిస్సెస్' చిత్రాన్ని నిర్మించామని, ఇప్పుడు కొత్తవారితో మరింత ఇన్నోవేటివ్ కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించాలనే తపనతో ఈ సినిమా చేశామని తెలిపారు. వ్యాపార లెక్కలకంటే మంచి సినిమా తీయాలనే ప్యాషన్‌తో పనిచేశామని, ఈ చిత్రంలోని లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కచ్చితంగా కదిలిస్తాయని పేర్కొన్నారు.



Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223